# ఆగేనా.. సాగేనా!

- బంజరు కాలువ పునరుద్ధరణపై సందిగ్ధం
- ప్రభుత్వం మారడంతో రైతుల ఆందోళన
- రూ.3.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం
- పనులు పూర్తయితే వెయ్యి ఎకరాలకు సాగునీరు
- 12 యేళ్లుగా నిరీక్షిస్తున్న అన్నదాతలు

**ఏటా వృథాగా పోతున్న వరదనీటిని ఒడిసి పట్టేందుకు ఓ పెద్దమనిషి సుమారు 72 ఏళ్లక్రితం వాగుపై ఆనకట్ట నిర్మించాడు. దానికి అనుసంధానంగా కాలువను సైతం నిర్మించి తూము ద్వారా నీటిని విడుదల చేసేలా ఏర్పాటు చేశాడు. ఈ కాలువ కింద సుమారు వెయ్యి పైచిలుకు ఎకరాలకు సాగునీరు అందింది. 60 ఏళ్లపాటు రైతులు రెండు పంటలు పండించుకున్నారు. ఆ తర్వాత సదరు కాలువ శిథిలావస్థకు చేరింది. పలు చోట్ల గండ్లు పడ్డాయి. ముళ్లపొదలు పెరిగిపోయాయి. మరికొన్ని చోట్ల పూడుకుపోయింది. ప్రస్తుతం పనికిరాకుండా పోయింది. దీని మరమ్మతుకు అధికారులు గతంలోనే ప్రతిపాదనలు పంపినా అనుమతులు రాలేదు. ఇపుడు ప్రభుత్వం మారినందున పనులకు అనుమతి ఇస్తుందా.. లేక నిరాకరిస్తుందా.. అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.**


పురాతన ఆనకట్ట (బంజరుమాటు)

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 8: మండలంలోని పాంనూర్ గ్రామ రైతులకు పూర్వం సాగునీటి సదుపాయం లేదు. కాని శివారులోని వాగు గుండా ఏటా వేలాది క్యూసెక్కుల వరద నీరు వృథాగా పోయేది. అదే గ్రామానికి చెందిన బాపుదొర అనే వ్యక్తి ఈ విషయాన్ని గమనించారు. సుమారు ఏడు దశాబ్దాల క్రితం దానిపై ఆనకట్ట నిర్మించాలని అనుకున్నారు. వెంటనే వాగు అంతా కలియతిరిగి ఒక చోట ప్రకృతి సిద్ధంగా ఉన్న పెద్దబండరాయిని గమనించి దానిపై ఆనకట్ట (బంజరుమాటు) నిర్మించారు. దానికి కుడి వైపున ఒక తూమును ఏర్పాటు చేశారు. దాని ద్వారా గ్రామ పరిధిలోని సుమారు 1050 ఎకరాల ఆయకట్టుతో పాటు జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్లు గ్రామ శివారులో సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందించేలా మాటును నిర్మించారు. ఇందుకోసం తూము కింద 3.1 కిలోమీటర్ల పొడవైన కాలువను నిర్మించారు. దీంతో ఏటా బంజరుమాటు ద్వారా రెండు పంటలను సాగు చేసుకునే సౌకర్యం ఏర్పడింది. ఇలా సుమారు 60యేళ్ల పాటు రైతులు రెండు పంటలు పండించుకున్నారు. ఆ తర్వాత కాలక్రమేణా బంజరు కాలువ అనేక చోట్ల కూడుకుపోవడంతో పాటు కాలువలో చెట్ల పొదలు పెరిగిపోయాయి. పలు చోట్ల గండ్లు పడడంతో తూము ద్వారా వచ్చేనీరు వృథాగా పోతోంది. ఫలితంగా పన్నెండు ఏళ్లుగా కాలువ నిరుపయోగంగా ఉంటోంది.

**ప్రతిపాదనలు పంపినా..**

రైతుల కోరిక మేరకు బంజరు కాలువ పునరుద్ధరణకు అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ చూపారు. నాలుగు నెలల క్రితం సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో బంజరుమాటు మరమ్మతులతో పాటు కాలువ నిర్మాణానికి సర్వే చేయించారు. దీంతో అధికారులు 3.1 కిలోమీటర్ల మేర కాలువ పునరుద్ధరణకు రూ.3.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాలువ మొత్తం కాంక్రీట్‌తో నిర్మించడంతో పాటు గేట్‌వాల్వ్‌తో కూడిన 8తూములు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు తయారు చేశారు. ఇటీవల నీటిపారుదల శాఖ ఎస్ఈ, డీఈ, ఏఈలు సందర్శించి సదరు రిపోర్టును నీటిపారుదల శాఖ కమిషనర్‌కు పంపించారు. ఇంకా పరిపాలన పరమైన అనుమతులు రాలేదు. ఈలోగా ప్రభుత్వం మారింది. కొత్త సర్కారు అయినా అనుమతులు ఇస్తుందా లేదా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

**కాలువ నిర్మాణంతో రైతులకు ప్రయోజనం..**

**- కోతి రేణుక-రాములుగౌడ్, పాంనూర్ సర్పంచ్**



బంజరుకాలువను పునరుద్ధరిస్తే పాంనూర్ రైతులకు మేలు జరుగుతుంది. వందలాది ఎకరాలు సాగులోకి వస్తాయి. కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం మారడంతో జాప్యం జరుగుతోంది. కొత్త ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

**వందలాది ఎకరాలకు సాగునీరు..**

**- బత్తిని రాజుగౌడ్, కాంగ్రెస్ నాయకుడు**



కాలువ పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తే రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. వందలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా రైతులు రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు జరిగేలా చూస్తాను.

**కాంగ్రెస్ సర్కారు స్పందించాలి..**

**- బత్తిని అశోక్‌గౌడ్, బంజరు కాలువ సాధన కమిటీ కన్వీనర్**



బంజరుమాటు నిండా నీళ్లు ఉండి కూడా ఉపయోగం ఉండడంలేదు. దశాబ్ధకాలంగా వందలాది ఎకరాల ఆయకట్టు సాగుకు నోచుకోవడంలేదు. డీపీఆర్ సిద్ధమైనప్పటికీ పనులు ప్రారంభం అవుతాయనుకున్న తరుణంలో ప్రభుత్వం మారింది. దీంతో పనులు జరుగుతాయో, లేదో అనే అనుమానం కల్గుతోంది. కాంగ్రెస్ సర్కారు వెంటనే స్పందించి పనులకు అనుమతి ఇవ్వాలి.


పూడుకుపోతున్న బంజరు కాలువ


కాలువను సర్వే చేస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు (ఫైల్)

## సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయండి

**- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

జనగామ టౌన్, జనవరి 8: కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2022-23 వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించి మిల్లర్లు వారికి కేటాయించిన టార్గెట్ పూర్తి చేసేలా కలెక్టర్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతూ.. ప్రజా పాలన దరఖాస్తుల కంప్యూటీకరణను వేగవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శివలింగయ్య, అడిషనల్ కలెక్టర్‌లు పింకేశ్‌కుమార్, సుహాసిని, డీసీఎస్‌వో ఎం.రోజారాణి, డీఎంసీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్**

ప్రజా పరిపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకున్న డేటాను ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా పాలన ప్రత్యేక అధికారులు వినోద్‌కుమార్, రోజారాణి, కేఆర్.లత, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## రూ.13 కోట్లతో జనగామలో వృద్ధాశ్రమం

**ఈ నెలలో ప్రారంభించేందుకు చర్యలు**

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**


ఆశ్రమాన్ని పరిశీలిస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

జనగామ టౌన్, జనవరి 8: అనాథ, వృద్ధ, ఒంటరి, పేద మహిళల కోసం జనగామ మండలంలోని శామీర్‌పేట పరిధిలో కోమటిరెడ్డి సుశీలమ్మ పేరుతో వృద్ధాశ్రమం ఏర్పాటు చేశామని, త్వరలోనే ప్రారంభిస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. మూడెకరాల్లో నిర్మించిన ఈ ఆశ్రమానికి మొదట్లో రూ.3 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేయగా రూ.16 కోట్ల వరకు ఖర్చు వచ్చిందన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తయి వినియోగానికి సిద్ధంగా ఉందన్నారు. నిరుపేద మహిళలు, వృద్ధులకు ఈ ఆశ్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ నెలాఖరుకల్లా ఆశ్రమాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు. అవసరమైతే ప్రభుత్వ సహకారంతో ఆశ్రమం నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వేమల్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కంచ రాములు, శివరాజ్‌యాదవ్, దాసరి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

**శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి**


మండేలగూడెంలో మత్స్య కార్మిక సంఘం మహిళలకు బ్యాంకు రుణాల చెక్కులను పంపిణీ చేస్తున్న బండా ప్రకాష్, కడియం శ్రీహరి

రఘునాథపల్లి, జనవరి 8: బ్యాంకు రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. మండలంలోని మండేలగూడెం గ్రామానికి చెందిన మత్స్య కార్మిక సంఘంలోని 60 మంది మహిళలకు జనగామ యూనియన్ బ్యాంకు మంజూరు చేసిన రుణాలను సోమవారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రూ.30 లక్షల విలువైన చెక్కులను వారు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మత్స్య కార్మిక సంఘంలోని మహిళలు చేపలను విక్రయించడంతో పాటు చేపల పచ్చళ్లు తయారు చేసి విక్రయించాలని అన్నారు. హనుమకొండకు చెందిన మహిళా సంఘం సభ్యులు 10 మంది కలిసి పిండి వంటల తయారీలో మేటీగా నిలిచి అమెరికాకు సప్లయ్ చేసే స్థాయికి ఎదిగారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జనగామ యూనియన్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ రావు, సర్పంచ్ ఉత్తేపు ఉమారాణి సత్యనారయణ, మారజోడు రాంబాబు, వై.కుమార్ గౌడ్, వారాల రమేష్, లోనే శ్రావణ్, చెంచు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దు

**యువతకు డీసీపీ సీతారం సూచన**


మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్న వారికి అవగాహన కల్పిస్తున్న డీసీపీ సీతారాం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 8: యువకులు, విద్యార్థులు మాదక ద్యవ్యాలకు అలవాటుపడి భవిష్యత్తును, జీవితాలను ఆగం చేసుకోవద్దని డీసీపీ సీతారాం సూచించారు. సోమవారం సాయంత్రం ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో యువకులకు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు అమ్మినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. డ్రగ్స్‌కు అలవాటుపడి తల్లిదండ్రులకు ఇబ్బందులు తీసుకురావద్దన్నారు. కుటుంబాలకు అండగా నిలబడే వయసులో జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ నర్సిరాజు, ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి రైతుల ఆందోళన

**తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారంటూ ధర్నా**

**ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఉద్రిక్తత**

**పోలీసులు, అధికారుల చొరవతో సద్దుమణిగిన సమస్య**


మిర్చి ధర పెంచాలని కోరుతూ వరంగల్ మార్కెట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

వరంగల్ టౌన్, జనవరి 8: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో వ్యాపారులు (ఖరీదుదారులు) మిర్చి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. ఉదయం మార్కెట్లో యథావిధిగా మిర్చి జెండా పాట (నాణ్యత గల మిర్చి ధరను నిర్ణయిస్తారు) పాడారు. తేజ రకం మిర్చికి క్వింటాకు రూ.20,100 నిర్ణయించారు. మార్కెట్‌కు వండర్ హాట్, తేజ, యూఎస్-341, దేశీ ఇలా సుమారు 20 రకాల మిర్చి అమ్మకానికి వచ్చాయి. ఒక్కో రకానికి ఒక్కో ధర నాణ్యతను బట్టి వ్యాపారులు ధరలు నిర్ణయించి కొనుగోలు చేస్తారు. అయితే సోమవారం తేజ రకానికి క్వింటాకు రూ.20,100 జెండా పాట పాడగా వ్యాపారులు కొందరు రూ.17, ఇంకొందరు రూ.18వేలు, మరికొన్ని రూ.13 వేలు చొప్పున ధర నిర్ణయించి కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో తక్కువ ధర పలికిన రైతులు గొడవకు దిగారు.

విషయం తెలుసుకున్న మిగతా రైతులు పెద్ద ఎత్తున చేరుకుని తమకు కూడా ధరలు తగ్గించారని, గత ఏడాదితో పోల్చుకుంటే అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. మార్కెట్ ప్రధాన గేటు ముందు ఆందోళనకు దిగి కొద్ది సేపు ధర్నా చేశారు. సమాచారం అందుకున్న మార్కెట్ కార్యదర్శి సంగయ్య వెంటనే డీఎంవో ప్రసాదరావుకు, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి మల్లేశంకు పరిస్థితిని వివరించారు. అలాగే స్థానిక సీఐ మహేందర్, ఏసీపీ సతీష్ బాబు, డీసీపీ రవిందర్ దృష్టికి తీసుకెళ్లడంతో వారు మార్కెట్‌కు చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

**ఎవరి వాదన వారిదే...**

వ్యాపారుల పక్షాన చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డిని, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు లింగారెడ్డిని, ఆందోళన చేస్తున్న రైతులను కార్యాలయానికి పిలిపించి మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు మల్లేశం, ప్రసాద్ రావు, ఏసీపీ సతీష్ బాబు, డీసీపీ రవిందర్ చర్చించారు. వ్యాపారులు, రైతులు ఎవరి వాదన వారిదే అన్నట్లు కొద్దిసేపు నడిచింది. నాణ్యతను బట్టి ధర పలుకుతుందని వ్యాపారులు చెప్పగా, క్వింటాకు రూ.17వేలు పలికిన మిర్చి, క్వింటా రూ.13వేలు పలికిన మిర్చి ఒకే రీతిలో ఉందని, అలాంటప్పుడు అంత తక్కువ ధరకు ఎలా కొంటారని రైతులు ప్రశ్నించారు.

మిర్చిలో నాణ్యత ఉంటే ఒక ఖరీదుదారు కాకపోతే మరో ఖరీదుదారుడికి ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చని, లేదా మంచి ధర పలికినప్పుడే అమ్ముకోవాలని అప్పటి వరకు కోల్డ్ స్టోరేజీలో పెట్టుకోవచ్చని వ్యాపారులు తమ వాదన వినిపించారు. అధికారులు ఇరువర్గాలకు నచ్చ చెప్పారు. తక్కువ ధర పలికిందనిపిస్తే ఆ రైతుల వద్దకు మార్కెట్ అధికారులు, ఖరీదుదారులు, పోలీసులు వచ్చి పరిశీలించి నాణ్యతకు అనుగుణంగా ధర పెట్టేందుకు మరో ఖరీదుదారుడిచే కొనుగోలు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఇరువర్గాలకు నచ్చ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

# రైతులను ఆదుకుంటాం

**తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు**

**బయ్యన్న రిజర్వాయర్ నుంచి నీటి విడుదల**


బయ్యన్న రిజర్వాయర్ వద్ద ప్రత్యేకపూజలు చేస్తున్న సామేలు

కొడకండ్ల, జనవరి 8: సరిపడా సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని బయ్యన్న రిజర్వాయర్ వద్ద పూజలు చేసి సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సాగు నీరందించేందుకు అనేక ప్రాజెక్టులను కాంగ్రెస్ హయాంలోనే కట్టారని అన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంతో, ప్రధానమంత్రి మోదీతో సత్సంబంధాలు ఏర్పరుచుకోలేదని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే మెరుగయ్యాయని అన్నారు. కేసీఆర్ రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తానన్న మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, కాంగ్రెస్ నాయకులు అనురాధ, వివేక్ రెడ్డి, అంబేద్కర్, విజయకుమార్, నీటి పారుదల శాఖ ఈఈ రమేశ్, డీఈలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గేనా?

**కందుల రేఖకు మద్దతుగా గోవాకు వెళ్లిన ఎంపీటీసీలు**

**ఈ నెల 10న అవిశ్వాసంపై సమావేశం**


గోవాలో ఎంపీటీసీల బృందం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 8: స్టేషన్‌ఘన్‌పూర్ ఎంపీపీ కందుల రేఖపై అవిశ్వాసం కోరుతూ డిసెంబరు 16న 9మంది ఎంపీటీసీలు ఆర్డీవో వాసం రామ్మూర్తికి తీర్మాన పత్రం అందించారు. దీనికి సంబంధించి ఈ నెల 10న మండల ప్రజా పరిషత్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఎంపీటీసీలకు నోటీసులు పంపించారు. దీంతో అప్రమత్తమైన ఎంపీపీ కందుల రేఖ ఎలాగైనా అవిశ్వాసం నుంచి బయటపడాలని వ్యూహం రచించారు. ఈ నెల 10న జరుగనున్న సమావేశానికి ఎంపీటీసీలు గైర్హాజరైతే అవిశ్వాసం వీగిపోతుందనే లక్ష్యంతో పలువురు ఎంపీటీసీలను, వారి భర్తలను గోవాకు తీసుకెళ్లారు. గోవాకు వెళ్లినవారిలో ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ భర్త, మరో ఇద్దరు ఎంపీటీసీల భర్తలు, కోఆప్షన్ సభ్యుడు వెళ్లారు. ఈ నెల 12వ తేదీన వారు ఘన్‌పూర్‌కు తిరిగి వచ్చేలే ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం.

స్టేషన్‌ఘన్‌పూర్ మండల పరిధిలో మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గాలంటే 10మంది సభ్యులు మద్దతుగా చేతులేపాల్సి ఉంటుంది. 15మందిలో ఐదుగురు ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, మునిగెల రాజు, పురమాని రజాక్‌యాదవ్, గుర్రం రాజు, బెల్లపు వెంకటస్వామి ఇద్దరు ఎంపీటీసీల భర్తలు భూర్ల లత-శంకర్, నెలమంచ శైలజా-అజయ్ రెడ్డితో పాటు ఎంపీపీ భర్త కందుల రేఖ-గట్టయ్య మొత్తం 8మంది సభ్యులు గోవాకు వెళ్లారు. మిగితా ఏడుగురు ఇక్కడే ఉన్నప్పటికీ అవిశ్వాసం నెగ్గే అవకాశం లేదు. అంతేగాకుండా వారికి తోడు ఒకవేళ ఇక్కడే ఉన్న మహిళ ఎంపీటీసీలు భూర్ల లత, నెలమంచ శైలజ ఇద్దరు మద్దతుగా నిలిచినా 9మంది మాత్రమే అవుతారు. దీంతో అవిశ్వాసం వీగిపోతుందని వారు ధీమాగా ఉన్నట్లు తెలుస్తోంది.

## రఘునాథపల్లి సర్పంచ్‌గా యాద రాములు


కార్యదర్శి కవిత నుంచి నియమాక పత్రాన్ని అందుకుంటున్న యాద రాములు

రఘునాథపల్లి, జనవరి 8: రఘునాథపల్లి సర్పంచ్‌గా యాద రాములు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శి కవిత ఆయనకు నియమాక పత్రాన్ని అందజేశారు. ఇంతకు ముందు సర్పంచ్‌గా ఉన్న పోకల శివకుమార్‌పై ఎస్సీఎస్టీ కేసు నమోదు కావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ విభాగం అధికారులు ఆయనను సస్పెన్షన్ చేసి, ఉప సర్పంచ్ యాద రాములుకు బాధ్యతలు అప్పగించాలని ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా యాద రాములు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పని చేయడంతో పాటు ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.




















## వినతుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

### కలెక్టర్ సిక్తా పట్నాయక్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 8 : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులపై అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 60 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ కోసం 4, జీడబ్ల్యూఎంసీ 6, ఎస్సీ కార్పొరేషన్ 2, ఆర్డీవో 5, ఎంజీఎం 1, తహసీల్దార్ 11, ఎంపీడీవో 3, ఉపాధి కార్యాలయం 3 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మేన శ్రీను, ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్, మైనింగ్ విభాగం ఏడీ నర్సిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీడబ్ల్యూవో మధురిమ, మెప్మా పీడీ భద్రునాయక్, డీపీవో జగదీశ్వర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హ్యాండ్‌బాల్ పోటీలకు మహిళ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, జనవరి 8 : ఈనెల 10 నుంచి 14 వరకు కర్ణాటకలోని సేలం పెరియార్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ హ్యాండ్ బాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు తెలిపారు. 2023-24 ఏడాదికిగాను కేయూ నుంచి ఎంపికైన క్రీడాకారుల వివరాలను సోమవారం ప్రకటించారు. ఎంపికైన వారిలో కె.సువర్ణ, బి.భాగ్యశ్రీ, బి.మాధవి, (యూసీపీఈ, కేయూ) ఎస్. శివరాణి,(యూసీఈటీ, కేయూ) ఎస్.నందిని, (ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్, ఖమ్మం), బి.రమ్య,(యూసీపీఈ, కేయూ), ఎం.కరీన, (టీటీడబ్ల్యూఆర్డీసీ(వుమెన్స్),ఆసీఫాబాద్), కె.రమ్య (వీసీపీఈ, బొల్లికుంట), బి. రేహజు, (టీటీడబ్ల్యూఆర్డీసీ, వుమెన్స్, ఖమ్మం), కె.సింధూజ, (టీటీడబ్ల్యూఆర్డీసీ, వుమెన్స్ ఉట్నూర్ ), ఎం.రచన, (యూసీపీఈ, కేయూ), సీహెచ్. మౌనిక (టీటీడబ్ల్యూఆర్డీసీ, వుమెన్స్ ,ఉట్నూర్ ), టి.స్నేహ, (వీసీపీఈ, బొల్లికుంట), సీహెచ్.శివాని (టీటీడబ్ల్యూఆర్డీసీ, వుమెన్స్, మంచిర్యాల) ఇ.వెన్నెల (టీటీడబ్ల్యూఆర్డీసీ (వుమెన్స్), కొత్తగూడెం ),వి.రిషిత, (టీటీడబ్ల్యూఆర్డీసీ(వుమెన్స్), మంచిర్యాల)లు ఎంపికైయారు. వీరికి కొత్తగూడెం సింగరేణి వుమెన్స్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి మేనేజర్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన జట్టు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు అభినందించారు.

## క్యాంపు కార్యాలయంలో నాయిని పూజలు


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజల నిర్వహణలో నాయిని రాజేందర్ రెడ్డి, ఆయన సతీమణి నీలిమారెడ్డితో పాటు సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ సిటీ, జనవరి 8 : హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు సోమవారం పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచాక తన సతీమణి నీలిమారెడ్డి, అల్లుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కూతురు గోదారెడ్డి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి కార్యాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ కిరణ్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవీయస్ శ్రీనివాసాచార్యులు, ఈవీ శ్రీనివాస్, తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు విజయకుమారాచార్యులు, అరవింద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాల్సిందే..

కాజీపేట, జనవరి 8 : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట ఎంప్లాయీస్ సంఘ్ నాలుగు రోజుల రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సాధినేని వెంకటనారాయణ దీక్షలను ప్రారంభించారు. అనంతరం సీడబ్ల్యూసీ మెంబర్ చింత మురళి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టి జూదం ఆడుతుందన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, ఆ హక్కును ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసేంతవరకు ఉద్యమించి తీరుతామన్నారు. ఈ దీక్షలను స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో జమ్మికుంట బ్రాంచ్ సెక్రటరీ నర్సింగరావు, ఆపరేటింగ్ బ్రాంచ్ సెక్రటరీ ముస్తాక్ హుస్సేన్, వర్కింగ్ చైర్మన్ నారాయణ, కె. రవి, వరప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఏకాంబరం, బల్వీందర్ సింగ్, అజీజ్ పాషతోపాటు రైల్వే కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### రైల్వేలను నిర్వీర్యం చేస్తున్న ప్రధాని మోదీ

రైల్వేలను ప్రధానిమోదీ పూర్తిగా నిర్వీర్యం చేస్తూ రైల్వే కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చుక్కయ్య అన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని నిలిపివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట సోమవారం రైల్వే దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల దీక్షలను ప్రారంభించారు. ఈ దీక్షలను సీపీఎం నేత ఎం. చుక్కయ్య, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నేత చుక్కయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేలో ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా రైల్వే కార్మికు లపై పనిభారాన్ని పెంచుతూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఈ నిరసన దీక్షలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, కొండ శ్రీనివాస్, ఎస్‌కే.అఫ్జల్ పాల్గొన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో యూనియన్ అల్ బ్రాంచ్ కో- ఆర్డినేటర్ నాయిని సదానందం, దాడబోయిన శ్రీనివాస్ యాదవ్, సంగ రమేశ్, ఈ. రాజేందర్, కె. బాల మురళీ రాజ్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

## టీ- ఎమ్మార్పీఎస్‌కు పలువురి రాజీనామా

వడ్డేపల్లి, జనవరి 8: తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ అనుసరిస్తున్న తీరుకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వక్కల వెంకట్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నత్తి కోర్నెల్ మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాముల రమేష్ మాదిగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## టెన్త్‌లో 100 శాతం ఫలితాలు సాధించాలి

హనుమకొండ రూరల్, జనవరి 8: పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో టెన్త్ ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల హాజరుశాతంపై అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. ఇక నుంచి ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతీ వారం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై, జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఎ.శ్రీనివాస్, రాధ, సునీత, విజయ్ కుమార్, రామ్‌కిషన్‌రాజు, వెంకటేశ్వర్‌రావు, రమాదేవి పాల్గొన్నారు.

## కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

**ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ (ఇన్‌చార్జి) తిరుపతిరెడ్డి**



విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హనుమకొండ రూరల్, జనవరి 8: కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ (ఇన్‌చార్జి) వంటేరు తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్‌లోని దీప్య భవన్‌లో ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేసన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వంటేరు తిరుపతిరెడ్డి, విశిష్ట అతిథులుగా విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.అశోక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంకితభావంతో పని చేసి కంపెనీని ఆర్థికంగా బలోపేతం చేయడంలో అకౌంట్స్ ఆఫీసర్ల పాత్ర కీలకమన్నారు. సమష్టి కృషితోనే ఏదైనా సాధించే సత్తా మనందరిలో ఉందని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ విషయంలో ప్రభుత్వానికి నివేదించి వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారు తెలిపారు.

అనంతరం టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వేణుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఉపేందర్, ఉపాధ్యక్షులుగా కె.నవీన్ కుమార్, బి.వసంత్‌రావు, ఎస్.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుదర్శన్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఇ.మురళి, చంద్రమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.లక్ష్మణ్, రేష్మ, ఫైనాన్స్ సెక్రటరీగా బి.దేవేందర్, మహిళా కార్యదర్శిగా ఎం.సునీత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ అదనపు కార్యదర్శి ఎ.నాగరాజు, అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు, జనరల్ మేనేజర్లు, ఎస్ఏఓలు, ఏఓలు, జేఏఓలు పాల్గొన్నారు.

# బడుగుల అభ్యున్నతే ధ్యేయం

**దొంగల చేతిలో రాష్ట్రం లూటీ అయింది**

**రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి దంపతుల సేవలు అమూల్యం**

**ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్**

**గుర్తూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమి పూజ**

**పాల్గొన్న ఐదుగురు ఎమ్మెల్యేలు**



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు

తొర్రూరు రూరల్, జనవరి 8 : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో ఎన్ఆర్ఐ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సొంత ఖర్చుతో నిర్మిస్తున్న హనుమాండ్ల లక్ష్మమ్మ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భూమి పూజ కార్యక్రమాన్ని విప్ రాంచంద్రునాయక్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌లతో కలిసి సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ ఎంతో మంది యువకుల ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం దొంగల చేతిలో పడి లూటీ అయిందన్నారు. అలాంటి దొంగలను ప్రజలు తరిమికొట్టి మార్పు కోరుకుంటూ విద్యావంతులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాజకీయాల్లోకి రాకుండానే 40 ఏళ్లుగా సేవ చేస్తున్న డాక్టర్ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డిలు సేవాతత్పరులని, ఈ ప్రాంతం వారు కావడం అదృష్టమన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయగల సమర్థులని, ఇలాంటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అనేకంగా ఏర్పాటు చేయడానికి ముందుకురావాలని కోరారు.

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాక్షస పాలనను అంతం చేసి శాంతియుత పాలనకు స్వాగతం పలికిన ప్రజలను కాపాడుకోవడానికి ఝాన్సీ రుద్రమ్మవలే ముందుకు వచ్చారన్నారు. యువతలో నైపుణ్యం వెలికితీస్తేనే స్వయం శక్తులుగా ఎదుగుతారని, అందుకోసం పాటుపడుతున్న రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి దంపతులకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు.

ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు దోపిడీకి పాల్పడారని, వారంతా ఐపీసీ 390 పరిధిలోకి వచ్చే వాళ్లన్నారు. మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ దోపిడీ దారులకు అడ్డుకట్ట వేసి, బడుగుల అభివృద్ధి కోసం విద్యావంతులను అసెంబ్లీకి తీసుకెళ్లిన కాంగ్రెస్ పేదల పక్షపాతి అన్నారు.

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పుట్టిన గడ్డకు సేవ చేయాలనే తన అత్తామామలు హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి స్ఫూర్తితో ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి చేస్తామని అన్నారు. యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసినప్పుడే అభివృద్ధి చెందుతారని, కుటుంబంలో ఒక్కరికి ఉపాధి లభిస్తే కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందన్నారు. వాళ్లు పడ్డ కష్టాలు ఎవ్వరూ పడవద్దనే ఉద్దేశ్యంతోనే యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో ప్లంబింగ్, బ్యూటీషియన్, చేనేత తదితర పనులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమ కోడలిని గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడం కోసం, పాలకుర్తిని అభివృద్ధి చేయడానికి శక్తినంతా ధారపోస్తానని అన్నారు. ఈ గెలుపు తమది కాదని, ప్రజల గెలుపేనని అన్నారు.

### ఒకే వేదికపై ఐదుగురు ఎమ్మెల్యేలు

పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనుల శంకుస్థాపనకు ఐదుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెలే డాక్టర్ మురళీనాయక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆతిథ్యం ఇచ్చారు.

## నేడు పట్టుకున్న వాహనాల వేలం

హనుమకొండ క్రైం, జనవరి 8: హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తనిఖీలలో పట్టుకున్న రెండు వాహనాలను మంగళవారం ఉదయం సర్క్యూట్ గెస్ట్‌హౌస్ సమీపంలోని హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్టు ఆబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక బొలెరో వాహనం, ఒక ద్విచక్రవాహనం వేలం వేయనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటలకు వేలం పాట ప్రారంభం అవుతుందని 50 శాతం దరావత్ సొమ్మును చెల్లించిన తర్వాత పాటలో పాల్గొనాలని రామకృష్ణ తెలిపారు.

# మేడారంలో ముమ్మరంగా పనులు



జంపన్నవాగులో ఇసుక పోస్తున్న దృశ్యం



స్నాన ఘట్టాలను శుభ్రం చేస్తున్న కూలీలు

మేడారం, జనవరి, 8 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మల మహా జాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ఆయా పనులు చేపడుతున్నారు. జాతర తొలిరోజు కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలకు సారలమ్మ జంపన్న వాగు మీదుగా చేరుకోనున్న నేపథ్యంలో పలు పనులకు శ్రీకారం చుట్టారు. వాగులోని లోతట్టు ప్రదేశంలో టిప్పర్ల సహాయంతో ఇసుకను పోస్తూ మరమ్మతులు చేస్తున్నారు. అలాగే జాతరలో భక్తుల కోసం స్నాన ఘట్టాలను నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ప్రారంభించారు. స్నానాల కోసం బ్యాటరీ ట్యాప్స్, మహిళలు బట్టలు మార్చుకునే గదులు సిద్ధం చేస్తున్నారు. ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడికతీత పనులను ముమ్మరం చేశారు. సంక్రాంతి పండుగ లోపు అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

### పరిశీలించిన ఐటీడీఏ పీవో

మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం నీటిపారుదల చేపడుతున్న పనులను ఐటీడీఏ పీవో అంకిత్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని డీఈ సదయ్యకు సూచించారు. అనంతరం ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత, స్నాన ఘట్టాల వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాబ్స్, ఆదివాసీ మ్యూజియం సుందరీకరణ పనులు పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో వసంతరావు, ఎస్‌వోఎం రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

## కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసరావు



కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ నూతన హాస్టల్స్ డైరెక్టర్‌గా కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు హాస్టల్స్ డైరెక్టర్‌గా ఉన్న జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య స్థానంలో శ్రీనివాసరావును నియమించారు. జనవరి 9న మంగళవారం వెంకయ్య నుంచి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. సోమవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో కేయూలో శ్రీనివాసరావు దివ్యాంగుల సెల్ డైరెక్టర్‌గా, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల జాయింట్ డైరెక్టర్‌గా, క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రభుత్వ పాలన శాస్త్రం, హెచ్ఆర్ఎం విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా, విభాగాధిపతిగా కొనసాగుతున్నారు.

## నేరస్థులకు శిక్షపడే కేసులు నమోదు చేయాలి

**మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు**

ఐనవోలు, జనవరి 8: నేరస్థులు తప్పుచేసి తప్పించుకోకుండా శిక్షపడే కేసులనే నమోదు చేయాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాధవత్ రాజు డిమాండ్ చేశారు. ఒంటిమామిడిపల్లిలో డిసెంబరు 25న మంత్రాల నెపంతో గోనె సోమలక్ష్మి(65) అనే వృద్ధురాలిని హత్యచేశారు. ఈ సంఘటనపై మానవహక్కుల వేదిక బృందం నిజనిర్ధారణ కోసం ఒంటిమామిడిపల్లి గ్రామంలో బాధితురాలి ఇంటిని సందర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. సోమలక్ష్మి దగ్గరి బంధువైన గోనె పెద్దరాజు కుమారుడు గోనె మధు డిసెంబరు 17న వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు మృతుడి తల్లిదండ్రులు దేవుడు చెప్పేవారి వద్దకు వెళ్లి అడిగించుకున్నారని తెలిపారు. దేవుడు చెప్పేవారు మీ సమీప బంధువు (చేతబడి) మంత్రాలు చేయడం వల్లే మీ కుమారుడు చనిపోయాడని చెప్పడంతో రాజు కుటుంబసభ్యులు సోమలక్ష్మిని హత్యచేశారని తెలిపారు. పోలీసులు సకాలంలో నిందితులను గుర్తించినప్పటికీ మూఢ నమ్మకాలను నమ్మి హత్య చేశారని వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని తెలిపారు. కేవలం హత్యచేశారని కేసు నమోదు చేయడంతో సరైన సాక్ష్యాధారాలు ప్రత్యక్ష సాక్షులు లేరని కేసు నీరుగారి నిందితులు బయటకు వస్తారన్నారు. పోలీసులు కేవలం హత్యకేసు కాకుండా సంఘటనా స్థలంలో లభించే వాస్తవ ఆధారాలతో హత్య చేశారని కేసు నమోదు చేస్తే నిందితులకు శిక్ష పడుతుందన్నారు. మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకరావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి టి. హరికృష్ణ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి దిలీప్ పాల్గొన్నారు.

## ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా




కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్


హనుమకొండ అర్బన్, జనవరి 8 : ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని ఎంజీఎం సూపరిం టెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్ టీయూసీ) ఎంజీఎం బ్రాంచ్ ప్రెసిడెంట్ గద్దెల ప్రేమలత అధ్యక్షతన సోమవారం నూతన సంవత్సర సంబరాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంజీఎం సూపరింటెం డెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ కేక్ కట్ చేసి మా ట్లాడారు. ఎంజీఎం ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, కొప్పు ప్రసాద్, ప్రేమలత, ఎంజీ ఎం బ్రాంచ్ ఫార్మసీ సూపర్‌వైజర్ ఎంకి పద్మావతి, సునీత, రాజ్యలక్ష్మీ, ప్రీతి, సజని, సుప్రియ, సరళారాణి, సల్మా, శ్యామల, సృజన, ఉదయకృష్ణ, రమాదేవి, భిక్షపతి, ఉమాదేవి, జమున, సుచరిత, అనురాధ తదిత రులు పాల్గొన్నారు.

## కేయూ ఏబీవీపీ నూతన కమిటీ ఎంపిక

**అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రశాంత్, శ్రావణ్**



ప్రశాంత్



శ్రావణ్

కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నూతన అధ్యక్షుడిగా కొక్కుల ప్రశాంత్, కార్యదర్శిగా బొండ్ల శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ న్యూబాయ్స్ హాస్టల్‌లో ఏబీవీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి, ఏబీవీపీ వరంగల్ విభాగ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబులు హాజరై కేయూ కమిటీ వివరాలను ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు వైస్ ప్రెసిడెంట్స్ లక్ష్మణ్, అశోక్, నవీన్, చరణ్, రాజు, లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీస్‌గా రాజు, అజయ్, రఘు, సాయి, ప్రకాశ్, యశ్వంత్, శివ తదితరులు ఎంపికైయారు. ఈ సమావేశంలో నూతన కమిటీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు, కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజష్, రాష్ట్ర నాయకులు అంబాల కిరణ్, చట్ల సతీశ్, పెండ్ల అమర్, గట్టు ప్రశాంత్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు

హనుమకొండ రూరల్, జనవరి 8 : 2023-24 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లలో ఈ నెల 11వ తేదీలోపు చివరి అవకాశంగా అపరాధ రుసుంతో అడ్మిషన్ పొందవచ్చునని డీఈవో అబ్దుల్ హై, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ఫీజు www.telanganaopenschool.org ఆన్‌లైన్‌లో చెల్లించి రశీదు పొందాలన్నారు. పూర్తి వివరాలకు 80084 03631, 93963 37572 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### జీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా రవి



తాళ్ళపెల్లి ప్రకాశ్



దుర్గం రవి

ఖిలావరంగల్, జనవరి 8: ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తాళ్ళపెల్లి ప్రకాశ్, ఉపాధ్యక్షుడుగా దుర్గం రవిలు ఎన్నికయ్యారని టీజీఏ రాష్ట్ర సంఘం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు చెన్నూరి వెంకట విమాదిత్య ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికలలో ప్రకాశ్, రవిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పేర్కొన్నారు. వరంగల్ నగరానికి చెందిన వీరు రెండేళ్లపాటు కమిటీలో కొనసాగుతారన్నారు.

## కేయూ హాస్టల్స్‌లో అవినీతిపై విచారణ జరిపించాలి

**ఎస్ఎఫ్ఐ, బీఎస్ఎఫ్ నేతల డిమాండ్**

కేయూ క్యాంపస్, జనవరి 8: కేయూ హాస్టళ్లలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి కల్లెపల్లి ప్రశాంత్ డిమాండ్ చేశారు. కేయూలో జరిగిన సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. నాణ్యతలేని పాలు, పెరుగు, కిరాణ సామాన్లను పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై నాణ్యతలేని సరుకులను సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. వర్సిటీ అధికారులు తమకు అనుకూ లమైన వారికి కాంట్రాక్టర్లు ఇప్పించుకుంటున్నారని మండిపడ్డారు. నాసిరకం ఆహార పదా ర్థాలు సరఫరాతో విద్యార్థులు తరుచుగా అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు హతీరాం, జిల్లా కమిటీ సభ్యుడు స్టాలిన్, జస్వంత్, రోహిత్, బీఎస్ఎఫ్ నాయకులు మధు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 'బిల్ట్'పై చిగురిస్తున్న ఆశలు

- ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ప్రభుత్వం ఫోకస్
- ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



ములుగు, జనవరి 8: బిల్ట్ కార్మికుల ఆశలు చిగురిస్తున్నాయి. ఫ్యాక్టరీని తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోంది. మంగపేట మండలం కమలాపురంలోని ఈ కర్మాగారం 2014లో మూతపడగా దాన్ని పునరుద్ధరించేందుకు రేవంత్ సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాంటి ప్రయత్నమే చేయగా అది సఫలీకృతం కాక కార్మికుల్లో సుమారు పదేళ్లుగా నైరాశ్యం నెలకొంది. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయడంతో ఈసారైనా తమ కలలు సాకారం అవుతాయా..? అని కార్మికులు చర్చించుకుంటున్నారు.

### ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ప్రతినిధులతో సీఎం భేటీ

బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం అడుగు వేసిందని తెలుస్తోంది. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశాలతో బిల్ట్ ఆస్తులపై హక్కులు పొందిన ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ సొల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ హార్థిక్ పటేల్, ఐటీసీ పేపర్ బోర్డులు, స్పెషాలిటీ పేపర్స్ విభాగం సీఈవో వాదిరాజ్ కులకర్ణితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణపై చర్చించారు. కర్మాగారాన్ని తెరిపించేందుకు ప్రభుత్వం ద్వారా పూర్తి సహకారం అందిస్తామని హామీనిచ్చారు. దీనిపై ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దీంతో కార్మికుల్లో అడుగంటిన ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిల్ట్ కర్మాగారానికి మంచిరోజులు రావాలని సర్వత్రా కోరుకుంటున్నారు.

### 2014లో మూతపడిన ఫ్యాక్టరీ

కమలాపురంలో 1975 మార్చి 18న బిల్ట్ కర్మాగారానికి (కలప గుజ్జు తయారీ యూనిట్)కు పునాదిరాయి పడింది. పారిశ్రామికవేత్త ఎల్.ఎం.థాపర్ ఏపీ రేయాన్స్ పేరిట కంపెనీని స్థాపించగా 1981లో ఉత్పత్తి ప్రారంభమైంది. 2014 వరకు విజయవంతంగా నడిచిన ఫ్యాక్టరీలో ఉత్పత్తయ్యే కలప గుజ్జుకు బహిరంగ మార్కెట్‌లో విలువ పడిపోయింది. దీంతో ఆ ఏడాది ఏప్రిల్ 4న ఉత్పత్తిని నిలిపివేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. అంతకు మూడురోజుల ముందు రెండు వేల మంది పీఎఫ్ కార్మికులను విధుల నుంచి తొలగించింది.

### ప్రోత్సాహకాలను ప్రకటించిన బీఆర్ఎస్ సర్కార్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మూతపడ్డ తొలి మధ్యతరహా పరిశ్రమగా బిల్ట్ చర్చనీయాంశమైంది. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకొచ్చింది. 2015లో జీవో 19 ద్వారా కొంతమేరకు రాయితీలు ప్రకటించింది. అయితే అవి సరిపోవంటూ యాజమాన్యం తెగేసి చెప్పింది. ఈ నేపథ్యంలో మళ్లీ 2018లో రూ.350కోట్లు ప్యాకేజీని ప్రకటిస్తూ అప్పటి ప్రభుత్వం జీవో 48ను విడుదల చేసింది. కలపకు ఏటా రూ.21కోట్ల సబ్సిడీని ప్రకటించింది. ఏడేళ్లపాటు మొత్తం రూ.147 కోట్లు మంజూరు చేసేందుకు అంగీకరించింది. అలాగే విద్యుత్‌కు ఏటా రూ.9 కోట్ల చొప్పున ఏడేళ్లపాటు మొత్తం రూ.63కోట్లు, ఏటా 1.50లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును ఏడేళ్లపాటు సరఫరా చేసేందుకు రూ.వెయ్యి చొప్పున మొత్తంగా రూ.105 కోట్లను చెల్లించేందుకు ఒప్పుకుంది. కమర్షియల్ ట్యాక్స్, టీఎస్-ఎన్‌పీడీసీఎల్‌కు బకాయిపడ్డ సొమ్మును వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది. అయితే.. మొదట్లో ఫ్యాక్టరీని తెరిచేందుకు అంగీకరించిన మేనేజ్‌మెంట్ కొద్దిరోజులకు మళ్లీ మాటమార్చింది. ఈ కర్మాగారం పేరున పెద్ద ఎత్తున రుణాలు తీసుకోగా రుణదాత సంస్థల ప్రతినిధులు, కార్మికులు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. యాజమాన్య నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మికులు 777 రోజులపాటు రిలే నిరాహారదీక్షలు చేశారు. మొదటి దఫా 363 రోజులుగా, రెండో దఫా 414 రోజులు దీక్ష కొనసాగించారు.

### వేతన బకాయిలు ఇప్పిస్తారా...!?

ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిచిపోవడానికి ముందు 600 మంది కాంట్రాక్టు కార్మికులు, 317మంది పీఎఫ్ కార్మికులను యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. ప్రస్తుతం 600 మంది పర్మనెంట్ కార్మికులు మిగలగా వారికి ఎలాంటి జీతాలు లేవు. ఈమొత్తం బకాయి ఇప్పటి వరకు రూ.50 కోట్లపైనే ఉంటుందని అంచనా. గడిచిన తొమ్మిదేళ్లలో చాలామంది ఉద్యోగ విరమణ పొందగా వారికి ఎలాంటి ప్రయోజనాలు అందలేదు. ఒకవేళ ఫ్యాక్టరీని తెరిపిస్తే పెండింగ్ వేతనాల మాటేమిటి..? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఉపాధి లేక పొట్టచేత పట్టుకొని వలస పోయిన వారిని ఆదుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

# డేటా ఎంట్రీని వేగవంతం చేయాలి

- సిబ్బందిని ఆదేశించిన అధికారులు

జఫర్‌గడ్, జనవరి 8: అడిషనల్ కలెక్టర్ పర్మార్ పింకేష్‌కుమార్ సోమవారం రాత్రి జఫర్‌గడ్ మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించి దరఖాస్తుల కంప్యూటరీకరణను తనిఖీ చేశారు. ప్రజాపాలనలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు, కంప్యూటర్లు, ఎంట్రీ చేసే సిబ్బంది సంఖ్య, కొనసాగుతున్న విధానంపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. డేటా ఎంట్రీ విధానాన్ని పరిశీలించారు. జిల్లాలో ఇతర మండలాల కంటే ఇక్కడ దరఖాస్తుల కంప్యూటరీకణ నత్తనడకన సాగుతోందంటూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇక్కడ చుట్టూ గుట్టలు, కొండల ప్రాంతం కావడంతో ఇంటర్‌నెట్ సిగ్నల్‌కు ఆటంకం ఏర్పడుతోందని అధికారులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి, పగలు కూడా పని చేసి నిర్దేశించిన తేదీలోగా దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించవద్దన్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. అవసరమైన కంప్యూటర్లను, సిబ్బందిని ఏర్పాటు చేసుకుని కంప్యూటరీకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా మండల ప్రత్యేకాధికారులు డాక్టర్ మనోహర్, శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, తహసిల్దార్ ఆంజనేయులు ఉన్నారు.

### పరిశీలించిన ఆర్డీవో రాంమూర్తి

ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో రాంమూర్తి ఆదేశించారు. జఫర్‌గడ్ మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయాల్లో కొనసాగుతున్న కంప్యూటరీకణను సోమవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేయాలన్నారు. ఏ దరఖాస్తు చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీలోగా కంప్యూటరీకరణను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పండుగ సెలవుల నేపథ్యంలో జాప్యం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా, మండలంలో మొత్తం 14,200 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్లు మనోహర్, శ్రీనివాస్, డీఆర్‌డీఏ డీపీవో వరలక్ష్మి, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, తహసిల్దార్ ఆంజనేయులు, డీటీ హరిప్రసాద్, ఎంఆర్ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

### 17లోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలి..

చిలుపూర్: ఈ నెల 17వ తేదీలోగా ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, మండల అదనపు ప్రత్యేక అధికారి రమేష్ తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో చేపడుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను స్థానిక ఎంపీడీవో ఫులుగు వేణుగోపాల్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును ప్రత్యేక పోర్టల్‌లో భద్రపరుస్తున్నామని, ప్రతీరోజూ వెయ్యి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూలమ్మ, పంచాయతీ కార్యదర్శులు ఎమ్డీ అజీజ్ పాషా, హైమ, శషిదర్, శ్రీకాంత్, టీఏ చేరాలు తదితరులు పాల్గొన్నారు.



జఫర్‌గడ్‌లో డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో రాంమూర్తి

# కబడ్డీకి కేరాఫ్‌గా ఛాగల్ నిలవాలి

- క్రీడల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 8: కబడ్డీకి కేరాఫ్ ఛాగల్ అనేలా క్రీడలు నిర్వహించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. ఛాగల్ గ్రామ స్వాగత్‌యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12, 13, 14 తేదీలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడోత్సవాల వాల్ పోస్టర్లను సోమవారం ఆయన హనుమకొండలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా ఏర్పట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో పోగుల సారంగపాణి, కూన రాజు, రమేష్, వేళ్ల శ్రీకాంత్, జాబు అనిల్, ప్రజేష్, బూర్ల యాకయ్య, ఎమ్డీ పాషా, ఇమ్రాన్, పొన్న రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ క్రీడల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

### కొమురయ్య కుటుంబానికి అండగా నిలబడుతా..

మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన కడియం యువసేన సోషల్ మీడియా ఇన్‌చార్జి మేకల శ్రీకాంత్ తండ్రి కొమురయ్య మూడు రోజుల క్రితం అకాల మరణం చెందగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం కొమురయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాపోలు మధుసూదన్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుధీర్ రెడ్డి, మారుజోడు రాంబాబు, తీగల కరుణాకర్‌రావు, పొన్న శ్రీనివాస్, ఐలోని సుధాకర్‌గౌడ్, చాడ రాజ్‌కుమార్, వక్కల రాజు, జక్కుల రాజయ్య, నారాయణ, మారపాక రాములు, మేకల మల్లేషం, సొదరపల్లి సంపత్, వెంకట్‌నాయక్, రాపోలు చరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### నష్కల్‌లో పరామర్శ..

చిలుపూర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వడ్లకొండ లక్ష్మినారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. సోమవారం నష్కల్ గ్రామానికి చేరుకున్న ఆయన లక్ష్మినారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ కర్ణకంటి స్వప్న వెంకటేశ్, ఆరూరి స్వామి, మోడెం భిక్షపతి, స్వామి, చిర్ర శంకర్, ఉప సర్పంచ్ చిర్ర రాజు, మోడెం స్వామి తదితరులు ఉన్నారు.

# విద్యుదాఘాతంతో కూలీ మృతి



సాంబరాజు (ఫైల్)

పాలకుర్తి, జనవరి 8: మండలంలోని కోతులబాదు గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ కూలీ మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ గ్రామానికి చెందిన శివరాత్రి సాంబరాజు (30) పదేళ్ల నుంచి మిషన్‌భగీరథలో కూలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం గ్రామంలో మేయిన్ పైపులైన్‌కు మరమ్మతు చేసేందుకు ఎస్కలేటర్ (జేసీబీ)తో గోతి తీస్తుండగా పైన విద్యుత్ తీగలు తగలడంతో పక్కనే ఉన్న సాంబరాజుకు షాక్ కొట్టి మృతి చెందాడు. ఆయనకు భార్య పుష్పలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి ఎస్సై శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జాతీయ అవార్డుకు ఎంపికైన సతీష్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 8: బహుజన సాహిత్య అకాడమీ వారు అందించే జాతీయ సేవా రత్న అవార్డుకు స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన కొలిపాక సతీష్ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో అకాడమీ అధ్యక్షుడు రాధాకృష్ణ ఎంపిక పత్రాన్ని అందించారు. తన తల్లి సరోజన జ్ఞాపకార్థం నిర్వహించిన రక్తదానం, అన్నదానం, దుప్పట్ల పంపిణీ, పేదలకు స్కూల్ ఫీజుల చెల్లింపు తదితర సేవలు గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారని సతీష్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న తిరుపతిలో అవార్డును ప్రదానం చేస్తారని చెప్పారు. అవార్డు రావడం తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.

# స్టడీ మెటీరియల్ పంపిణీ

జఫర్‌గడ్, జనవరి 8 : మండలంలోని హిమ్మత్‌నగర్ జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు సోమవారం వరంగల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థుల కోసం రోటరీ క్లబ్ అధ్యక్షుడు మామిడాల రమేశ్‌బాబు, కార్యదర్శి బండి మనోహర్‌రెడ్డి, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ముస్కు భాస్కర్‌రెడ్డి స్టడీ మెటీరియల్ పాఠశాలకు పంపించగా, స్థానిక సర్పంచ్ తాటికాయల అశోక్, ఎంపీటీసీ యార నీలమ్మ సోమిరెడ్డి, తిరుమల్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్‌లను సాధించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థులకు ట్రస్ట్ తరఫున నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ యార మంజుల, ఉపాధ్యాయులు వసంత, వెంకటస్వామి, లక్ష్మణ్, సలాఉద్దీన్, సుమలత, వేణుగోపాల్, శ్రీనాథ్, మాధవి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుడి మృతి పట్ల నివాళి

పాలకుర్తి, జనవరి 8 : మండలంలోని చెన్నూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుస్కూరి వెంగళ్‌రావు ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళ్లర్పించారు. వెంగళ్‌రావు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటన్నారు. వారితో పాటు మార్కెట్ మాజీ చైర్మన్ రాఘవరావు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, భైరి భార్గవ్, మాదాసు హరీష్ నివాళి అర్పించారు.

# కొనసాగుతున్న అయోధ్య అక్షింతల పంపిణీ



జనగామలో అక్షింతలు పంపిణీ చేస్తున్న నగర సంయోగ ప్రతినిధులు

జనగామ టౌన్, జనవరి 8: అయోధ్య రామాలయానికి చెందిన అక్షింతలను సోమవారం జనగామ పట్టణంలో పంపిణీ చేశారు. పట్టణంలోని నగరేశ్వర వాసవీ కన్యకా పరమేశ్వరి సీతారామచంద్రస్వామి దేవాలయం నుంచి పంపిణీని ప్రారంభించారు. అక్కడి నుంచి మార్కెట్ రోడ్, పాత బీటు బజార్, నెహ్రూ పార్క్, శివాలయం వీధిలో ఇంటింటికీ తిరిగి అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర సంయోగ గుణికంటి రామకృష్ణగౌడ్, కౌన్సిలర్ హరిశ్చంద్రగుప్తా, ఏరియా సంయోగ తడకమల్ల నరసింహారావు, ఐత శ్రీనివాస్, రామిని రాజేశ్వర్, ఎర్రం హనుమంతరావు, నాళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

**జఫర్‌గడ్:** అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం ఊరూరా కొనసాగుతోంది. సోమవారం జఫర్‌గడ్‌లో రామాలయం, వడ్డెగూడెంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజల అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయ పక్షాల ప్రతినిధులు, గ్రామస్తులు ఆయా పురవీధుల గుండా మంగళవాయిద్యాలతో ఊరేగిస్తూ ఇంటింటికీ స్వామి వారి అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పండితులు రయ్యాల కృష్ణమాచార్యులు, పొడిచేటి వెంకటాచార్యులు, ఎంపీటీసీ రజిత యాకయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, వార్డు సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

**బచ్చన్నపేట:** అయోధ్య రామమందిర అక్షింతలను గ్రామాల్లో ఇంటింటికీ చేరుస్తున్నారు. ప్రజలు ఎంతో భక్తిభావంతో వాటిని స్వీకరిస్తున్నారు. రామమందిరం తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కులమతాలు, పార్టీలకతీతంగా కొనసాగుతోంది. మండల పరిధిలోని 26 గ్రామాల్లో పంపిణీ కార్యక్రమం దాదాపు పూర్తయ్యింది. సోమవారం డప్పుచప్పుళ్ల, భజనలతో వీధుల గుండా తిరుగుతూ ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు.

# పీఆర్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ

పాలకుర్తి, జనవరి 8: 2024 పీఆర్టీయూటీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల వనరుల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు బైకాని వెంకన్న, కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తామన్నారు. బదిలీలు, పదోన్నతులు కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో శోభారాణి, సురేందర్‌రెడ్డి, సోమయ్య, శ్రీనివాస్, రాజిరెడ్డి, సరిత, రామానుజన్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**స్టేషన్‌ఘన్‌పూర్:** డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌లను జడ్పీటీసీ మారపాక రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించేలా పునాదులు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.కొమురయ్య, శారోని, ప్రవీణ్‌కుమార్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు గిరెడ్డి ప్రమోద్ రెడ్డి, ప్రధానకార్యదర్శి ఇనుగాల ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు లక్ష్మిప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, సదమోహన్, జ్ఞానకుమారి, రవికుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.



పాలకుర్తిలో పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

# ఉచితంగా ఎముకల పరీక్షలు



జనగామలో ఎముకల పరీక్షలు చేస్తున్న వైద్యులు

జనగామ టౌన్, జనవరి 8: జనగామ పట్టణంలోని ఆదిత్య ఆస్పత్రిలో సోమవారం ఉచితంగా ఎముకల వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో సన్ ఫార్మా కంపెనీ సౌజన్యంతో బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు నిర్వహించగా 150 మందికి పైగా హాజరయ్యారు. వీరికి ఎముకల గట్టితనం, సాంద్రత పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మాచర్ల భిక్షపతి, జోన్ చైర్మన్ జైన రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జైన సంధ్యారాణి, ఆదిత్య హాస్పిటల్ సిబ్బంది దోర్నాల రమేశ్, హరీశ్‌రెడ్డి, హేమలత, శారద, అశ్విని, నాగలక్ష్మి, వంశీ తదితదితరులు పాల్గొన్నారు.

# హోంనీడ్స్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న మహిళలు

జనగామ టౌన్, శ్రీకల్ప సోషల్ సర్వీసెస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు హోంనీడ్స్ ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చారు. సోమవారం పట్టణంలోని 12వ వార్డులో ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్ఫ్, పినాయిల్, డిటర్జెంట్ లిక్విడ్, షాంపు తయారీపై శిక్షణ ఇచ్చినట్లు సంస్థ వ్యవస్థాపకులు ఆలేటి కల్పలత తెలిపారు. మహిళల స్వయంశక్తిని పెంపొందించడంలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని ఆమె చెప్పారు. శిక్షణ అనంతరం సొంతంగా యూనిట్లు పెట్టుకునేందుకు సంస్థ సహకరిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూలక్ష్మి, నాగరాజు, ట్రైనర్లు సుందరయ్య, టీవీకే రెడ్డి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడి ఎన్నిక



రమేష్ నాయక్

చిలుపూర్, జనవరి 8: మండలంలోని ఫతేపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన గుగులోతు రమేష్‌నాయక్ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. సోమవారం పార్టీ జిల్లా నాయకుడు భానోత్ వెంకట్రాం నాయక్ ఆధ్వర్యంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఆదేశాలమేరకు గ్రామంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంలాల్, పీఏసీఎస్ డైరెక్టర్ ఉమ్లానాయక్, హుస్సేన్, భిక్షపతి, అనిల్, వీరన్న, మోహన్, బాలరాజు, కొంర, భద్రు, బుజ్జమ్మ, జగన్, బాలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించాలి



డిపో మేనేజర్ ధరంసింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేశ్

చిలుపూర్, జనవరి 8 : మండలంలోని నష్కల్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతూ ఆర్టీసీ హన్మకొండ లోకల్ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ నాయక్‌కు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పాశం సురేశ్ వినతిపత్రం అందజేశారు. సోమవారం హన్మకొండలోని ఆర్టీసీ కార్యాలయంలో డీఎం ధరంసింగ్‌ను కలిసిన సురేశ్ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పాశం సురేశ్ మాట్లాడుతూ, నష్కల్ సమీపంలో ఇటీవల నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి కారణంగా అధికారులు బస్సు సర్వీసులను నిలిపివేశారని, ప్రస్తుతం గ్రామానికి బస్సు వెళ్ళేందుకు అనుకూలమైన రోడ్డు మార్గం ఉన్నందున సర్వీసులను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని ఆయనకు వివరించారు.

# పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్, జనవరి 8 : కేయూ పరిధిలో సోమవారం పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి. యూనివర్సిటీ క్యాంపస్‌లో పరీక్షల కేంద్రాలను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పరిశీలించారు. క్యాంపస్‌లోని మానవీయ శాస్త్ర భవనంలోని హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగాలలో నిర్వహించిన పరీక్షల కేంద్రాలను సందర్శించారు. వర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ తదితర విభాగాలకు చెందిన 5484 మంది పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారని, వారికి 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు.

# ప్రయోగాత్మక విద్య అందించాలి

### వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి



సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 8: ప్రయోగాత్మక విద్యతో విద్యార్థులకు జ్ఞాన సంపద పెరుగుతుందని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని తాటికొండ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.13.5లక్షలతో నిర్మించనున్న సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్స్‌ల్యాబ్‌తో విద్యార్థుల్లో ప్రయోగాత్మక జ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. కేవలం చదవి వదిలివేయకుండా ప్రాక్టికల్‌గా తెలుసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కౌడ రాజేందర్, ఉప సర్పంచ్ మారపాక రాములు, ఎస్ఎంసీ చైర్మన్ యుగేంధర్, బర్మా రాజయ్య, వక్కల రాజు, పాలకుర్తి నాగరాజు, ఏఈ వెంకటనర్సు పాల్గొన్నారు.

# ఆలయానికి సాయిబాబా విగ్రహ వితరణ

లింగాలఘణపురం, జనవరి 8: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయానికి విగ్రహాన్ని అందించేందుకు దాత ముందుకొచ్చారు. మండల కేంద్రానికి చెందిన గూటం నాగరాజు హైదరాబాద్‌లో రూ.1.20లక్షలతో పాలరాతి విగ్రహాన్ని కొనుగోలు చేసి సోమవారం ఆలయానికి అందించారు. దాన్ని త్వరలోనే ఆలయంలో ప్రతిష్ఠిస్తామని నిర్వాహకులు తెలిపారు.



సాయి బాబా విగ్రహంతో దాత నాగరాజు